సాక్షి హనుమకొండ

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ఇక ఆలయ ఆస్తులకు రక్షణ

దేవాలయాలు, ఆలయ భూముల ఆక్రమణకు ఇకపై తెరపడనుంది. భూములను జియో ట్యాగింగ్ చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. - IIలో▸



కొమురం భీమ్ పోరాటమే స్ఫూర్తి

తెలంగాణ ఉద్యమానికి కొమురం భీమ్ పోరాట నినాదాలే స్ఫూర్తి అని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. - IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
30^0 /22^0

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

నేషనల్ సైన్స్‌డే సందర్భంగా పోటీలు

కేయూ క్యాంపస్: నేషనల్ సైన్స్‌డే సందర్భంగా కేయూలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్‌లాల్ ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఈనెల 26న జువాలజీ విభాగంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు క్విజ్, 3గంటల నుంచి 5 గంటల వరకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. 28న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు బయో టెక్నాలజీ విభాగంలో పెయింటింగ్, కెమిస్ట్రీ విభాగంలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపులేదు

- ఎమ్మెల్యేను నిలదీసిన కార్యకర్తలు



వర్ధన్నపేట: పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లేకుండా పోయింది.. తమను కాదని కొత్తగా వచ్చిన వారికి ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని వర్ధన్నపేట మున్సిపల్ పరిధి 5,7, 8, 9, 12 వార్డుల కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే నాగరాజును నిలదీశారు. గురువారం వర్ధన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అనంతరం ఆయన వెళ్తున్న సమయంలో కార్యకర్తలు ఎమ్మెల్యేను ఆపారు. నాడు అధికారంలో ఉండి ఆర్థికంగా లబ్ధిపొంది ఎన్నికల అనంతరం తమ పార్టీలో చేరి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని పక్కకు తప్పించి కాన్వాయ్ వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు.

ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు

హన్మకొండ: వరంగల్ రీజియన్‌కు సూపర్ లగ్జరీ బస్సులు చేరుకుంటున్నాయి. మంగళవారం రాత్రి డీలక్స్ బస్సు ఒక్కటి, బుధవారం రాత్రి 4 సూపర్ లగ్జరీ, మరో డీలక్స్ బస్ చేరింది. వీటిని వరంగల్–2 డిపోకు తరలించారు. ఇప్పటి వరకు ఆరు ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి.

2న బహిరంగ విచారణ

కాళోజీ సెంటర్: స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా అంశంపై నవంబర్ 2న ఉదయం 10 గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కులాల ప్రతినిధులు రాజకీయ, సామాజిక, ఆర్థికపరమైన అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ చైర్మన్ లేదా సభ్య కార్యదర్శి పేరుతో ఆరు సెట్ల కాపీలు, అఫిడవిట్ సమర్పించి విచారణకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాక్టికల్స్ నిర్వహించాలి..

కాళోజీ సెంటర్: విద్యార్థుల హాజరు, ప్రాక్టికల్స్, సిలబస్ పూర్తిపై ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు దృష్టి సారించాలని డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్ సూచించారు. గురువారం వరంగల్ నగరంలోని పలు కళాశాలలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

ప్రతిపాదనలు పంపించాలి

కాళోజీ సెంటర్/వరంగల్: గణతంత్ర దినోత్సవానికి ప్రత్యేక అతిథులుగా ఉత్తమ సర్పంచ్‌లను ఆహ్వానించేందుకు ఈనెల 30లోగా ప్రతిపాదనలు పంపించాలని భారత ప్రభుత్వ కార్యదర్శి వి.శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం న్యూఢిల్లీ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి రెండు గ్రామాలను ఎంపిక చేసి నిర్ణీత గడువులోగా నివేదిక పంపించాలని పేర్కొన్నారు. వీసీలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, పంచాయతీ అధికారి కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి..



దామెర: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎంహెచ్ఓ లలితాదేవి అన్నారు. ఒగ్లాపూర్ సమీప పవర్‌గ్రిడ్‌లో డీజేఎం డి.సమ్మయ్య ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో చురుగ్గా పాల్గొనాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆశాలత, ఆర్థోపెడిక్ డాక్టర్ లక్ష్మణ్, పిడియాట్రిక్ డాక్టర్ సృజన, డాక్టర్లు పద్మశ్రీ, రుబీన, మహేంద్ర, మంజుల, పీహెచ్ఎన్ లీల, హెచ్ఈఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, హెల్త్ అసిస్టెంట్ సురేందర్, ఎల్టీ కృష్ణ, ఏఎన్ఎం భారతి పాల్గొన్నారు.

ఆదేశాలు తూచ్..!

కలెక్టరేట్‌లో కార్యాలయాల మార్పుపై అధికారుల నిర్లక్ష్యం

- ఉత్తర్వులు వెలువడి నెలరోజులవుతున్నా ఆఫీసు ఖాళీ చేయని వ్యవసాయ శాఖ
- ఖాళీ చేస్తే వస్తామంటున్న వైద్య ఆరోగ్య శాఖ..



హన్మకొండ అర్బన్ : పరిపాలనా సౌలభ్యం కోసం కీలక ప్రభుత్వ శాఖలు కలెక్టరేట్‌లో ఉండాలనే ఉద్దేశ్యంతో కలెక్టర్ ప్రావీణ్య జారీ చేసిన ఆదేశాలను అధికారులు పెడ చెవిన పెడుతున్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు తొలి ప్రాధాన్యత ఇస్తుండటంతో అయా శాఖల పనితీరుపై కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అందులో భాగంగానే ములుగు రోడ్డు ఆటోనగర్‌లోని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయాన్ని కలెక్టరేట్‌లోకి మార్చాలంటూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం డీఎంహెచ్ఓ అధికారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. వారు వచ్చేందుకు వీలుగా కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేసి వైద్య ఆరోగ్య శాఖకు స్వాధీనం చేయలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రెండవ అంతస్తులోనే ఖాళీగా ఉన్న మరో హాల్‌ను కూడా వైద్య ఆరోగ్య శాఖకు కేటాయించారు. రెండవ అంతస్తు నుంచి ఖాళీ చేసిన వ్యవసాయ శాఖకు మొదటి అంతస్తులో సర్దుబాటుకు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ ఖాళీ చేయలేదు.. వైద్య ఆరోగ్య శాఖ కలెక్టరేట్‌కు రాలేదు.

ఎందుకు నిర్లక్ష్యం..?

కలెక్టరేట్‌కు రావాలంటూ వైద్య ఆరోగ్య శాఖను కలెక్టర్ ఆదేశించినప్పటికీ వైద్య ఆరోగ్య శాఖలో కొందరు అధికారులకు కలెక్టరేట్‌కు రావడం ఇష్టం లేదని తెలుస్తోంది. ఇక్కడి వస్తే నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘాలో ఉండాల్సి వస్తుందని, రోజూ అటెండెన్స్ తప్పనిసరి అవుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఇక్కడికి వచ్చేందుకు వారు ఆసక్తి చూపడంలేదని వినికిడి. ఇదిలా ఉండగా విశాల కార్యాలయంలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు మొదటి అంతస్తులోకి వెళ్లి పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సర్దుబాటు కావడం వారికి కూడా ఒకింత ఇబ్బందిగానే ఉన్నట్లు సమాచారం. అందుకే పదేపదే చెబుతున్నా వీళ్ల మారట్లేదు.. వాళ్లు రావట్లేదు.. వైద్య ఆరోగ్య శాఖ కలెక్టరేట్‌కు వస్తే ఉన్నతాధికారుల కనుసన్నల్లో అశాఖ ఉంటే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వాళ్లు ఖాళీ చేయగానే వచ్చేస్తాం..



కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో మాకు కేటాయించిన ప్రస్తుత వ్యవసాయ శాఖ కార్యాలయం ఇంకా వారు పూర్తిగా ఖాళీ చేయలేదు. వారు ఖాళీ చేస్తే మేము వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు మా కార్యాలయంలో చేపడుతున్నాం. ఇక్కడికి వస్తే కలెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది కాబట్టి మా సిబ్బంది పనితీరు మెరుగవుతుందని ఆశిస్తున్నాను.

– డాక్టర్ లలితాదేవి, హనుమకొండ డీఎంహెచ్ఓ

నేటి నుంచి 'క్రితి-2024'

- కేఎంసీలో రెండు రోజుల వేడుకలు
- వివిధ పోటీలు.. మెడికల్ ఎగ్జిబిషన్లు
- దేశ నలుమూలల నుంచి హాజరుకానున్న మెడికోలు



సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్‌రెడ్డి

ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఈనెల 25, 26 తేదీల్లో కాకతీయ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేఎంసీ, యూఎస్ఏ ఎస్ఆర్ఐ అలుమినీ అసోసియేషన్ సంయుక్తంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఈవెంట్లు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఎంతో తోడ్పడుతాయని చెప్పారు. పరిశోధనల వైపు వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో వైద్య రంగంలో మెరుగైన ఫలితాలు సాధించగలమన్నారు. దేశ నలుమూలల నుంచి సుమారు వెయ్యికి పైగా మెడికోలు ఈ ఈవెంట్‌కు హాజరుకానున్నట్లు వివరించారు. యూజీ, పీజీ మెడికోలకు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(మెడ్ క్విజ్), పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియంలతో పాటు మెడికల్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య సుంకర్నేని, ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఏపీపీఏ అధ్యక్షుడు డాక్టర్ సతీష్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో యూఎస్ఏ ఎస్ఆర్ఐ అలుమినీ బాధ్యులు డాక్టర్ సుజీత్, డాక్టర్ వేణు, డాక్టర్ అనుపమా, మెడికోలు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి కృషి చేయాలి

- యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకన్న

హన్మకొండ అర్బన్: సమాజాన్ని చైతన్యం చేసేందుకు యువత కృషి చేయాలని వరంగల్ పోలీసు కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న సూచించారు. 'ప్రజాస్వామ్యం, పౌరసత్వం, గ్రామీణాభివృద్ధిలో యువత పాత్ర' అనే అంశంపై ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూషన్ బెంగళూర్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ కరుణాకర్ రావు ఆధ్వర్యాన శిక్షణ కార్యక్రమం గురువారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో ప్రారంభమైంది. వెంకన్న మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ముఖ్యంగా పిల్లలు, మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లల అభివృద్ధికి దూరంగా ఉంటున్నారని, యువత ఈ దిశగా కృషి చేయాలన్నారు. మై ఛాయిస్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ క్రాంతి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ సీహెచ్.చంద్రమౌళి శిక్షణ ఇచ్చారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, లోడీ, రికార్డు, సిరి స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు.

'ఏసీబీ' కొరడా!



అన్ని శాఖలపై నిఘా

- చిక్కుతున్న రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు
- వరుస దాడులతో అక్రమార్కుల్లో దడ

సాక్షిప్రతినిధి, వరంగల్ :

- ఆగస్టులో బెల్లం అక్రమ రవాణా కేసులో నిందితులను తప్పించేందుకు రూ.70 వేలు డిమాండ్ చేసి రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ జనగామ జిల్లా పాలకుర్తి ఎస్ఐ గుగులోతు వెంకన్న ఏసీబీకి చిక్కారు.
- సెప్టెంబర్‌లో లింగాలఘణపురంలో కొత్తగా పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం ఎన్ఓసీ జారీ విషయంలో చిర్ర సత్యనారాయణరెడ్డి నుంచి ఆర్‌అండ్‌బీ ఈఈ చిలకపాటి హుస్సేన్, ఏటీఓ రవీందర్ రూ.14 వేలు లంచంగా తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- తాజాగా గురువారం జేఎస్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్లకు చెందిన సదానందం అనే కాంట్రాక్టర్‌కు సంబంధించి రూ.4 లక్షల బిల్లు చెల్లించేందుకు పంచాయతీరాజ్ ఈఈ దిలీప్‌కుమార్, ఏటీఓ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

.. అవినీతి పరులు, అక్రమార్కులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) కొరడా ఝుళిపిస్తున్నా.. కొందరు అధికారుల తీరు మారడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కొంతకాలంగా ఏసీబీ దూకుడు పెంచి అవినీతి పరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. మరోవైపు అవినీతి ఊపిరిగా పనిచేసే అధికారులు కొందరు రూటు మార్చి అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. దీంతో వరుస దాడులతో అక్రమార్కుల ఆట కట్టిస్తున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు అన్ని శాఖలపైనా నిఘా పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పకడ్బందీ వ్యూహంతో..

ఏసీబీ పకడ్బందీ వ్యూహంతో దూకుడు పెంచగా అవినీతి, అక్రమార్కుల్లో దడ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 2021 సంవత్సరం ఏసీబీ దాడుల్లో ఏడుగురు ఉన్నతాధికారులు పట్టుబడగా, 2022లో 9, 2023లో 11 మంది చిక్కారు. ఈ ఏడాది అక్టోబర్ 24 నాటికి 11 కేసుల్లో 16 మంది వరకు పట్టుబడినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇందులో పోలీస్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్, రిజిస్ట్రేషన్ శాఖల వారు ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాదిలో ఒక్కసారి పరిశీలిస్తే జనవరి 5న విద్యాశాఖ (కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్–ఆడిట్ విభాగం)అధికారి సిగసారపు కిష్టయ్యపై ఏసీబీ దాడులు నిర్వహించింది. జనవరి 11న ఓ ఫార్మసిస్టు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా జనగామ డీఎంఅండ్‌హెచ్ఓ, జూనియర్ అసిస్టెంట్లను పట్టుకోవడం అప్పట్లో సంచలనం రేపింది. మార్చి 4న తొర్రూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అక్రమాస్తులపై దాడులు నిర్వహించిన ఏసీబీ.. ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం మార్చి 22న రూ.19,200 లంచం తీసుకుంటుండగా మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్‌ను పట్టుకుంది. అలాగే కేసు ఎత్తివేసేందుకు ఆర్టీసీ డ్రైవర్ నుంచి రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ ఏప్రిల్ 15న హుజూరాబాద్ డీఎం హనుమకొండలో ఏసీబీకి చిక్కాడు. కమలాపూర్ మండల కన్నూరుకు చెందిన ఓ రైతు నుంచి వ్యవసాయ భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా తహసీల్‌దారు, కంప్యూటర్ ఆపరేటర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురిపై దాడులు, అక్రమాస్తులపై సోదాలు నిర్వహించి అన్ని శాఖలో అవినీతి పరులపై ఆరా తీస్తుండడం కలకలం రేపుతోంది.

అంతా మా ఇష్టం..!

ఒక్కో పనికి ఒక్కో తీరు..

- టెండర్లలో 'కుడా' ఇష్టారాజ్యం
- అభివృద్ధి పనుల్లో నిబంధనలు గాలికి
- రూ.కోట్ల విలువైన పనుల నోటిఫికేషన్‌లో అయోమయం
- డివైడర్ల వర్క్ మొదలు కాకముందే 'గ్రీనరీ' టెండర్ల ప్రక్రియ

సాక్షిప్రతినిధి, వరంగల్ :



'అయినోళ్లకు ఆకుల్లో.. కానోళ్లకు కంచాల్లో..' అన్నట్లుంది కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఇంజినీరింగ్ విభాగంలో కొందరు అధికారుల తీరు. గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల విషయంలో నిబంధనల అమలులో వక్రభాష్యం చెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచే విషయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను అనుసరిస్తున్నారు. అయితే, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను పాటించాల్సిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాత్రం చాలా సందర్భాల్లో విస్మరిస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి.

ఒక్కో టెండర్‌కు ఒక్కో నిబంధన..

ఒకే విధమైన పనులకు టెండర్లు పిలుస్తున్న సందర్భాల్లో ఒక్కోసారి ఒక్కో తీరుగా నిబంధనలు పెడుతుండడం వివాదాస్పదం అవుతోంది. గతేడాది జూన్‌లో భద్రకాళి బండ్ ఎంట్రెన్స్‌లో సుమారు రూ.35 లక్షలతో గ్రీనరీ డెవలప్‌మెంట్ పనులకు టెండర్లు పిలిచారు. ఈ పనులకు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా 'సిమిలర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్' సరిపోతుందని పేర్కొన్నారు. ఇటీవలే పూర్తయిన నయీంనగర్ వంతెనపైన సుమారు రూ.22 లక్షలతో చేపట్టిన వర్టికల్ గార్డెన్ పనుల్లోనూ జీడబ్ల్యూఎంసీ ఇవే నిబంధనలు పెట్టింది. పెద్దపెండ్యాలలో పాత బస్టాండ్ వయా రెడ్డిపల్లి చర్చి, గ్రామపంచాయతీ వరకు రోడ్ల వెడల్పు, సీసీ రోడ్ల కోసం రూ.1.39 కోట్లతో పిలిచిన టెండర్లలోనూ ఇవే నిబంధనలను పేర్కొంది. అయితే ఎల్కతుర్తిలో జంక్షన్ నిర్మాణం సందర్భంగా గ్రీనరీ డెవలప్‌మెంట్ కోసం రూ.30.72 లక్షలతో ఈనెల 18న టెండర్లు పిలిచిన 'కుడా' అధికారులు.. 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కాంట్రాక్టర్లు టెండర్లు వేయొచ్చని పేర్కొన్నారు. ఈ పనుల విషయంలో మాత్రం హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ లైసెన్స్, అనుభవంతోపాటు ఐదేళ్లలో ఏదైనా సంవత్సరంలో టెండర్‌లో పాల్గొనే వర్క్‌కు సమాన విలువైన పని చేసి ఉండాలన్న నిబంధన పెట్టారు. అదేవిధంగా ఏ రకమైన మొక్కలు గ్రీనరీ డెవలప్‌మెంట్ కోసం నాటాలో పేర్కొన్న అధికారులు వాటి సైజును మాత్రం చెప్పలేదు. ఎందుకంటే.. వారికి అనుకూలమైన వారికి పనులు దక్కితే ఒకతీరు, లేకుంటే మరో తీరు సైజులను సూచించే వెసులుబాటును ఇంజినీరింగ్ అధికారులు తీసుకున్నారన్న చర్చ జరుగుతోంది.

కాంట్రాక్టు పొందినా.. అగ్రిమెంట్‌కు ససేమిరా..

ఎల్కతుర్తిలో జంక్షన్, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ కోసం సుమారు రూ.1.54 లక్షలతో 'కుడా' టెండర్లు పిలిచింది. భద్రకాళి బండ్ టెండర్‌తో పాటు ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు వర్క్ అగ్రిమెంట్ చేసే విషయంలోనూ కొందరు ఇంజినీరింగ్ అధికారులు తాత్సారం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. తమకు అనుకూమైన కాంట్రాక్టర్లకు ఈ పనులు దక్కలేదన్న ఒకే ఒక కారణంతో సతాయించారన్న ప్రచారం ఉంది. సదరు కాంట్రాక్టర్ తన ప్రయత్నాలు చేయడంతో ఎట్టకేలకు ఇటీవలే వర్క్ అగ్రిమెంట్ కాగా ఆలస్యంగా బుధవారం పనులు ప్రారంభించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. ఎలకతుర్తిలో జంక్షన్, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ తదితర సివిల్ వర్క్స్ పూర్తికాకముందే గ్రీనరీ డెవలప్‌మెంట్ పనులకు షార్ట్ టెండర్లు పిలవడం వెనుక అధికారుల ముందుచూపున్నట్లు తెలుస్తోంది. అనుకూలురు, టచ్‌లో ఉండే కాంట్రాక్టర్లకు కట్టబెట్టే యోచనతోనే చిన్న కాంట్రాక్టర్లకు తిరకాసు పెట్టేలా టెండర్ నిబంధనలు పెట్టినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. ఈ–ప్రొక్యూర్‌మెంట్ నిబంధనల మేరకు టెండర్లు పిలిచామని, సకాలంలో పనులు పూర్తి చేయాలనేదే తమ ఉద్దేశమని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

శిక్షణను ఉపయోగించుకోవాలి

- డీఈఓ వాసంతి



తరగతి గదిలో పరిశీలిస్తున్న ఆర్జేడీ, డీఈఓ

విద్యారణ్యపురి: ఉపాధ్యాయులు శిక్షణను వినియోగించుకోవాలని డీఈఓ వాసంతి అన్నారు. ఇటీవల నియామకమైన, పదోన్నతులు పొందిన జీవశాస్త్ర-భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణను ఆమె గురువారం పరిశీలించారు. జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్, ఎ.శ్రీనివాస్, హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి కె.రమేశ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, రిసోర్స్ ఉపాధ్యాయులు సంపత్, సునీత, కృష్ణవేణి, రమేశ్, శశికళాధర్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రూపొందించిన సామగ్రి ప్రదర్శన

ఎకో క్లబ్ రిజిస్ట్రేషన్ ఉన్న పాఠశాలల విద్యార్థులు రూపొందించిన అలంకరణ సామగ్రిని హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవంబర్ 4న ఉదయం 9:30 గంటలకు ప్రదర్శించనున్నట్లు డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామి తెలిపారు. మొదటి 60 పాఠశాలలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఉత్తమ విద్యార్థులకు రూ.3,000, రూ.2,000, రూ.1,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

పరీక్షల పరిశీలన

హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మెటివ్ అసెస్ మెంట్(ఎస్ఏ–1) పరీక్షలను ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈఓ వాసంతి గురువారం పరిశీలించారు. జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఎంఈఓ రమేశ్‌బాబు, హెచ్ఎం జగన్నాథం తదితరులు ఉన్నారు.

అమరులను స్మరిస్తూ ర్యాలీలో పాల్గొనండి

- సీపీ అంబర్ కిశోర్ ఝా



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హసన్‌పర్తి: శాంతి భద్రతల్లో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీలో పాల్గొనాలని నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఏజే పెడల్స్, ట్రిసిటీ సైకిల్ రైడర్స్' సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం కమిషనరేట్ నుంచి ప్రారంభించనున్న సైకిల్ ర్యాలీ ప్రచార పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. బిజీ జీవితంలో సైక్లింగ్ చేయడం కోసం కొంత సమయాన్ని కేటాయించడం అవసరమన్నారు. సైక్లింగ్ చక్కటి వ్యాయామమని పేర్కొన్నారు. ఈర్యాలీలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏజే పెడల్ యాజమాన్య వర్గ సభ్యులు జయంత్ వరుణ్, ఆనంద్, ట్రైసిటీ రైడర్స్ అసోసియేషన్ సభ్యులు అనుమాండ్ల విద్యాసాగర్, కంకణాల సుధాకర్‌రెడ్డి, కేదాసి వెంకటేశ్వర్‌కుమార్, ఎంపీ ప్రసాద్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పెండింగ్ ఉండొద్దు

- కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండొద్దని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏఈలు సందర్శించి పనుల పురోగతిని తనిఖీ చేయాలన్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్, టాయిలెట్ల నిర్మాణ పనులు వంద శాతం పూర్తి కావాలని చెప్పారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించేలా హెచ్ఎంలు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈఓ వాసతి, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ నాగపద్మజ, సీపీఓ సత్యనారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశోధన అవకాశాలు పెంచాలి



వీసీని సన్మానిస్తున్న సురేందర్‌రెడ్డి, ఇతర బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరిశోధన అవకాశాలు పెంచాలని ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డిని కోరారు. కేయూ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీసీ ప్రతాప్‌రెడ్డిని గురువారం క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో సన్మానించారు. ఈసందర్భంగా సురేందర్‌రెడ్డి పలు అంశాలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకులను ప్రోత్సహించేందుకు అర్హత కలిగిన అధ్యాపకులకు పరిశోధన పర్యవేక్షకులుగా నియమించాలన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో ప్రాధాన్యమివ్వాలన్నారు. వర్సిటీలో విద్యాప్రమాణాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రాజారెడ్డి, అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నా, కేయూ కో–ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, వివిధ జిల్లాల బాధ్యులు వెంకన్న, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన శోభ

కాజీపేట : కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో గురువారం రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న రైల్వే ఉద్యోగి శోభపై వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. విధులకు హాజరుకావడానికి నడుచుకుంటూ వెళ్తున్న శోభపై కుక్కలు ఒక్కసారిగా మీదపడడంతో కేకలు వేసింది. దీంతో చుట్టూ పక్కల వారు అప్రమత్తమై తరిమేశారు. అప్పటికే శోభ చెయ్యితో పాటు కాలికి తీవ్ర గాయాలు కావడంతో బాటసారులు రైల్వే ఆసుపత్రికి తరలించారు. కాగా, వీధి కుక్కలను నివారించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య


అరవింద్(ఫైల్)

వాజేడు: తండ్రి మందలించడానే కారణంతో క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పూసూరులో జరిగింది. వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లెబోయిన బతకయ్య కుమారుడు అరవింద్(21) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఇంటికి వచ్చిన కుమారుడితో బయటి పనులకు వెళ్తున్నావు.. ఇంటి వద్ద పనులు చేయవా అని మందలించాడు. దీంతో క్షణికావేశానికి లోనైన అరవింద్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తండ్రి బతకయ్య వెంటనే అరవింద్‌ను ములుగు ఏరియా ఆసుత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెరువులో పడి యువకుడి మృతి

గార్ల: మతిస్థిమితం లేని ఓ యువకుడు చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని తిర్లాపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వాంకుడోత్ రామన్న(26) మేకలను మేపేందుకు మరో వ్యక్తితో కలిసి సమీప అడవిలోకి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో దాహం వేయడంతో కుంట దగ్గరకు వెళ్లాడు. నీళ్లు తాగుతున్న క్రమంలో కాలుజారి కుంటలో పడి మృతిచెందాడు. తాగునీటి కోసం వెళ్లి ఇంకా రాలేదని కుంట దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే రామన్న మృతిచెందాడు. కాగా, తల్లిదండ్రులు రామన్న మృతదేహం మీద పడి గుండెల విసేలా రోదించారు.

ఇక ఆలయ ఆస్తులకు రక్షణ

- దేవాలయాలు, ఆలయ భూములకు జియోట్యాగ్
- సర్వేకు రంగం సిద్ధం
- ఉన్నతాధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

హన్మకొండ కల్చరల్: దేవాలయాలు, ఆలయ భూముల ఆక్రమణకు ఇకపై తెరపడనుంది. వరంగల్ జిల్లాలో భద్రకాళి, వేయి స్తంభాల ఆలయం, రామప్ప, కోటగుళ్లు అనేక చారిత్రక పురాతన దేవాలయాలు, అందమైన పర్యాటక ప్రాంతాలున్నాయి. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధి అన్ని దేవాలయాలను, దేవాలయాల భూములను జియో ట్యాగింగ్ చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దీప,ధూపనైవేద్యాల కోసం వందల ఏళ్లనాటి ఆలయాల పేరుతో వేలాది ఎకరాల భూములున్నాయి. కానీ.. వీటిని కాపాడడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇప్పటికే కొన్ని ఆలయాలకు సంబంధించిన వందలాది ఎకరాలు కబ్జాకు గురైనట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా రెవెన్యూ రికార్డుల్లో భూములు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి కనిపించడం లేదు. భూముల చుట్టూ ఫెన్సింగ్, ధరణి రికార్డుల్లో వివరాలు నమోదు కాకపోవడం వల్లనే ఆక్రమణలకు గురవుతున్నాయి. కొంత మంది భక్తులు, అర్చకులు, పాలక మండళ్లు ఇటీవల గుర్తించి సంబంధిత అధికారుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ప్రభుత్వం స్పందించింది. ఆలయ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది.


బోర్డు పాతుతున్న దేవదాయ శాఖ సిబ్బంది(ఫైల్)

జియో ట్యాగ్‌తోనే రక్షణ

జియో ట్యాగింగ్‌తో దేవాలయాలు, ఆలయాలకు సంబంధించిన భూములకు రక్షణ ఏర్పడనుంది. ఇదివరకే అన్యాక్రాంతమైన భూముల లెక్కలు తేలనున్నాయి. టూరిస్టులకు ఉపయుక్తంగా ఆలయాల వివరాలు, లోకేషన్ గూగుల్ ద్వారా తెలియనుంది. జియో ట్యాగింగ్‌పై దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో మంత్రి కొండా సురేఖ వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు సైతం వివరాల సేకరణలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

భూముల వివరాలు సేకరిస్తున్నాం



జిల్లాలోని దేవాదాయశాఖ పరిధి ప్రముఖ ఆలయాల విశిష్టత తెలిపేలా.. భూముల వివరాలు సేకరిస్తున్నాం. ఎక్కడైనా విలువైన భూములు అన్యాక్రాంతమైనా, కబ్జాలకు గురైనా వాటి వివరాలు సైతం సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. దేవాలయాల భూములను జియో ట్యాగ్ చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆలయ విశిష్టత, అభివృద్ధి, భూముల వివరాల సర్వే చేశాం. దేవాలయంలోని మూలమూర్తి చిత్రాలతో, దేవాలయ ఆవరణ కనిపించేలా వివరాలను ఆధునిక పరిజ్ఞానంతో జియో ట్యాగ్ చేస్తాం. దీని వల్ల ప్రపంచానికి ఆలయ విశిష్టత తెలిసి దేశ, విదేశాల నుంచి పర్యాటకుల రాక పెరుగుతుంది. ఆదాయ వనరులు పెరుగుతాయని ఆశిస్తున్నాం.

- రామల సునీత, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్

హమాలీలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల అందజేత


హమాలీ కార్మికుడికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందజేస్తున్న రాంకుమార్‌రెడ్డి

వరంగల్ : వ్యవసాయ మార్కెట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హమాలీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేసినట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రాంకుమార్ రెడ్డి తెలిపారు. వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అభ్యర్థన మేరకు ఎంజీఎం సూపరింటెండెంట్ 8 మంది వైద్య బృందాన్ని మార్కెట్‌కు పంపించడంతో గురువారం మార్కెట్ యార్డులో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయగా రాంకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో ఫిట్‌నెస్ ముఖ్యమని, అందుకే హమాలీలకు సర్టిఫికెట్లు ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలే పాక నిర్మల, చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్, నాయకులు మొగిలి చంద్రమౌళి, సాగర్ల శ్రీనివాస్, అల్లే సంపత్, చాంబర్ సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.

అమరుల త్యాగాలే స్ఫూర్తి..

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ
- పీటీసీ, బెటాలియన్‌లో ఓపెన్ హౌస్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మామునూరు: అమరవీరుల త్యాగాలే పోలీసులకు స్ఫూర్తిదాకమని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ), కమాండెంట్ రాంప్రకాశ్ అన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక విలువలు, హక్కులు, చట్టలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పలు పాఠశాలల విద్యార్థులకు మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల, టీజీఎస్పీ నాలుగో బెటాలియన్‌లో పరిపాలనాధికారుల ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేరాల సంఖ్య పూర్తిగా తగ్గుతుందన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే చెడును వీడి సన్మార్గంలో నడవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం పలు రకాల ఆయుధాలను ప్రదర్శించారు. ఆతర్వాత కృష్ణవేణి క్యాంప్ విద్యార్థులకు అధునాతన ఆయుధాలు, వాటి పనితీరు, చట్టాలు, కేసులు, రికార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమేశ్, ఏసీ భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, విజయ్, మహేశ్, రహమతుల్ల, రాజేశ్‌చారి, పీఆర్ఓ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పీఆర్ ఈఈ దిలీప్‌కుమార్

- ఏటీఓ, సీనియర్ అసిస్టెంట్ కూడా..
- రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఘటన


లంచం తీసుకుంటూ పట్టుబడిన ఈఈ దిలీప్‌కుమార్, ఏటీఓ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని పీఆర్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి, ఇద్దరు ఉద్యోగులు రూ.20 వేలు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్ మండలం తాడిచర్ల మాజీ వార్డు సభ్యుడు కుంట సదానందం 2023లో అదే గ్రామంలో రూ.10 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో రెండు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాడు. పనులు పూర్తి చేయగా రూ.5.83 లక్షల బిల్లులు చెల్లించారు. మిగతా రూ.4.17 లక్షల బిల్లు విషయమై సదానందం అనేకమార్లు పంచాయతీరాజ్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని మొరపెట్టుకున్నా కనికరించలేదు. బిల్లుల మంజూరుకు రూ.20 వేలు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సదానందం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు సూచన మేరకు గురువారం సాయంత్రం రూ.20 వేలు తీసుకొని పంచాయతీరాజ్ కార్యాలయానికి వెళ్లి ఈఈ సంపతి దిలీప్‌కుమార్‌కు రూ.10 వేలు, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్(ఏటీఓ) తాలాల చంద్రశేఖర్‌కు రూ.5 వేలు, సీనియర్ అసిస్టెంట్ వలపదాసు శోభారాణికి రూ.5 వేలు అందజేశాడు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, అధికారులు లంచం పుచ్చుకున్న ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే 106 టోల్ ఫ్రీ నంబర్ కాల్ చేయాలన్నారు. సీఐలు శ్యాంసుందర్, ఎస్. రాజు, ఎల్. రాజు పాల్గొన్నారు.


అధికారులను పట్టించిన సదానందం

కొమురం భీం పోరాట నినాదాలే స్ఫూర్తి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం: తెలంగాణ ఉద్యమానికి కొమురం భీం పోరాట నినాదాలే స్ఫూర్తిగా నిలిచాయి.. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం సాగిందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రం వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహాన్ని ఏపీలోని అరకు ఎమ్మెల్యే మాచ్చా లింగం, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ జెండాను తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడారు. ఈ ప్రాంతానికి వలసలు ఎక్కువ అయ్యాయన్నారు. ఫలితంగా భూముల కోసం గొడవలు పెట్టుకోవాల్సి దుస్థితి నెలకొందన్నారు. శాంతియుత వాతావరణం కోసం సంఘాల నాయకులు ప్రజల మధ్య మధ్యవర్తిత్వం వహించి వలసలను నివారించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడుతామన్నారు. పదేళ్ల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఐటీడీఏలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఐటీడీఏకు ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఐటీడీఏను మరింత బలోపేతం చేసి గిరిజనాభివృద్ధికి దోహదపడుతామన్నారు.

యువత చెడుమార్గంలో వెళ్తోంది..

ఆదివాసీ యువత చెడు మార్గంలో వెళ్తోందని, పోరాట స్ఫూర్తిని పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ లోని అరకు ఎమ్మెల్యే మాచ్చా లింగం అన్నారు. కొమురం భీం విగ్రహావిష్కరణకు హాజరై మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర అన్నారు. కార్యక్రమంలో నాయకులు వట్టం ఉపేందర్, మైపతి అరుణ్‌కుమార్, పొడెం కృష్ణప్రసాద్, పొడెం రత్నం, పొడెం బాబు, చెరుకు ధర్మయ్య, బాబురావు, నల్లబోయిన కోటయ్య, రవీందర్, జబ్బ రవి, ముద్దబోయిన రవీందర్, సిద్ధబోయిన జగ్గారావు, ఈసం నర్సయ్య, ఇర్ప కేశవరావు, చందా సత్యనారాయణ, లక్ష్మణ్‌రావు, కాక భాస్కర్, బొల్లెం సారయ్య, సీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.5లక్షల40వేల విలువైన బంగారం అపహరణ
- కామారెడ్డిపల్లెలోఘటన


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీసీపీ రవీందర్

పరకాల: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని కామారెడ్డిపల్లెలో జరిగింది. సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సెక్యూరిటీ గార్డు కోరె విజయ్‌కుమార్, తన కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఉద్యోగాలు, కూలీ పనులకు వెళ్లారు. ఈ సమయంలో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం బీరువా ధ్వంసం చేసి 13 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. విజయ్‌కుమార్, తన భార్య సాయంత్రం ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లోకి వెళ్లగా బీరువా ధ్వంసమై అందులో ఉన్న వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన విజయ్‌కుమార్ లబోదిబోమంటూ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలో రూ.5లక్షల 40వేల విలువైన బంగార ఆభరణాలు చోరీకి గురయ్యాయని కన్నీరు మున్నీరయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ గురువారం తెలిపారు. కాగా, గురువారం సాయంత్రం ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

నాలుగు జిల్లాల్లో నకిలీ పాస్‌పుస్తకాల దందా

- ముఠాలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నాం
- డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్


నిందితులను చూపుతున్న జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్

ములుగు రూరల్ : అక్రమార్కులు నకిలీ అటవీ హక్కు పత్రాల (పోడు పట్టాలు)తో ములుగు జిల్లాతో పాటు జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో దందా కొనసాగించారని జిల్లా అటవీ శాఖ జిల్లా అధికారి రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తమ అదుపులో ఉన్న ముఠాలోని ఐదుగురు నిందితులను చూపి వివరాలు వెల్లడించారు. చందావత్ భద్రు, వాంకుడోత్ రవి, జాటోత్ రాజ్‌కుమార్, తాటిపాముల రాజు, భూక్య వెంకన్న, బానోత్ హరికిషన్, ధారావత్ కిషన్.. ఈ ఏడుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. ఇందులో నర్సంపేట మండలం ముగ్ధంపురానికి చెందిన చందావత్ భద్రు నకిలీ పోడు పట్టాల తయారీలో ప్రధాన సూత్రదారుడు. ఇతడికి ములుగు మండలంలోని కాశిందేవిపేటకు చెందిన వాంకుడోత్ రవి.. అమయాకుల వద్ద డబ్బు సేకరించి పోడు పట్టాలు కోసం డబ్బు, వివరాలు అందిచేవాడు. వెంకటాపురం(ఎం) మండలం ఇన్‌చెరువుపల్లికి చెందిన జాటోత్ రాజ్‌కుమార్ ములుగు జిల్లాలో పంపిణీ చేసిన పోడు పట్టా పుస్తకాన్ని ఆ ఇద్దరికి అందించి సహకరించేవాడు. వరంగల్‌లోని గణేశ్ ప్రింటర్స్‌లో ఆ పోడు పుస్తకాన్ని వరంగల్‌కు చెందిన తాటిపాముల రాజు అనే వ్యక్తికి ఇవ్వగా అతడు నకిలీ పుస్తకాలు తయారు చేసి ఇచ్చే వాడు. అలాగే, నెక్కొండ మండలం అమీనాబాద్‌కు చెందిన భూక్య వెంకన్న పాస్ పుస్తకాల్లో క్యూర్ కోడ్‌ను తయారీ చేసేవాడు. దీనిపై విచారణ చేపట్టి ఈ ఐదుగురిని తమ అదుపులోకి తీసుకున్నామన్నారు. కాగా, పాస్ పుస్తకాలపై హోలోగ్రామ్స్ వేసే మహబూబాబాద్‌కు చెందిన బానోత్ హరికిషన్, ఎఫ్ఆర్ఓ సంతకం ఫోర్జరీ చేసిన నర్సంపేటకు చెందిన ధారావత్ కిషన్ పరారీలో ఉన్నట్లు వివరించారు. ముఠా సభ్యులను ఇప్పటి వరకు ప్రాథమిక విచారణ చేపట్టామని, పూర్తి స్థాయి విచారణకు పోలీసులకు అప్పగిస్తామన్నారు. కాగా, ముఠాకు అటవీశాఖ అధికారులు సహకరించినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారని డీఎఫ్ఓను 'సాక్షి' ప్రశ్నించగా సిబ్బంది సహకరించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి డోలి శంకర్, డీఎఫ్ఆర్ఓ, బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


కాజీపేటను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

- నష్కల్–చింతలపల్లి గూడ్స్ లైన్‌పై పునరాలోచించాలి
- కాజీపేట రైల్వే ఆస్పత్రిని మల్టీస్పెషాలిటీ చేయాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎం ఎ.కె.జైన్‌తో సమావేశం


రైల్వే జీఎంతో జరిగిన ఎంపీల మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.. నష్కల్–చింతలపల్లి గూడ్స్ రైల్వే లైన్‌పై పునరాలోచించాలి.. కాజీపేట రైల్వే ఆస్పత్రిని మల్టీస్పెషాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. సికింద్రాబాద్ రైల్‌నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఎ.కె.జైన్‌తో తెలంగాణ, కర్ణాటక ఎంపీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తన నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన కొత్త రైల్వేలైన్లు, రైల్వే అండర్‌బ్రిడ్జిలు, ఫుట్‌ఓవర్‌బ్రిడ్జిలు, లెవెల్‌క్రాసింగ్ గేట్లు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, కొత ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే సమస్యలపై ప్రస్తావించారు. అనంతరం ఆమె మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వేకు ముఖ ద్వారంగా ఉన్న కాజీపేటను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి రైల్వే బోర్డు, రైల్వే మంత్రి ప్రతిపాదనలు పంపాలని కోరారు. కొత్తగా నిర్మించనున్న నష్కల్–చింతలపల్లి గూడ్స్‌రైల్ నిర్మాణంపై పునరాలోచన చేయాలన్నారు. కొత్త లైన్ ప్రతిపాదనలపై స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడంతో రైతుల నుంచి వ్యతిరేకత వస్తున్నదని వివరించారు. కాజీపేట రైల్వే ఆస్పత్రిలో సిబ్బందితోపాటు మహిళా డాక్టర్‌ను నియమించాలని కోరారు. నత్తనడకన సాగుతున్న ఫాతిమానగర్ ఆర్వోబీ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులకు సరిపడా ప్లాట్‌ఫామ్‌లు పెంచాలని, జంక్షన్ ఆవరణలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థలం కేటాయించాలని కోరారు. పై అంశాలపై సానుకూలంగా స్పందించిన రైల్వే అధికారులు రానున్న రైల్వే బోర్డు మీటింగ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.


ఎస్సీ వర్గీకరణ అమలుకు పోరాడాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- కేయూలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి సదస్సు

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణ అమలు కోసం మరో పోరాటం చేసేందుకు మాదిగ విద్యార్థులంతా సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కేయూలో నిర్వహించిన మాదిగ విద్యార్థుల (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర స్థాయి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోనే ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అమలు చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. వర్గీకరణ చేపట్టకపోవడంతో ఉద్యోగాల భర్తీలో ఎస్సీల్లోని వివిధ కులాలు నష్టపోతున్నాయన్నారు. వర్గీకరణ అమలుకు చేపట్టబోయే రథయాత్రలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఎంఎస్ఎఫ్ బాధ్యుడు బొచ్చు తిరుపతి స్వాగతోపన్యాసం చేయగా.. కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీను, బాధ్యులు డాక్టర్ సంకినేని వెంకట్, సోమశేఖర్, సత్యజాల, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యులు గొవింద్ నరేశ్, నాయకులు వడ్డేపెల్లి మధు, మంద భాస్కర్ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు కలెక్టర్, ఎమ్మెల్యే పరామర్శ


వార్డులో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నయీంనగర్: హనుమకొండ కేయూ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. గురువారం ఛాతి, క్షయ ఆస్పత్రిని వారు పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగుల హాజరు పట్టికను పరిశీలించి.. ప్రతీ వార్డులో ఉన్న రోగులను కలిసి వారికి అందుతున్న చికిత్స, సౌకర్యాలు, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగంతో పాటు మేల్, ఫిమేల్ వార్డులు, ఆర్ఐసీయూ, బ్రాంకో స్కోపీ రూమ్, సెమినార్ హాల్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఆస్పత్రికి సంబంధించి అందిస్తున్న వైద్య సేవలు, కావాల్సిన సదుపాయాలను ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సునీత, వైద్యులు, సిబ్బందిని కలెక్టర్, ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి రోగులు వస్తున్న నేపథ్యాన్ని వైద్యులు వివరించారు. పురాతనంగా ఉన్న భవనాల స్థానాల్లో నూతన భవన నిర్మాణాల కోసం ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఆస్పత్రి అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు పంపించాలని వైద్యులకు ఎమ్మెల్యే, కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి, ఆర్డీఓ వెంకటేశ్, టీఎస్ఎంఐడీసీ ఈఈ కేఎస్‌కే.ప్రసాద్, డీఈ రాజశేఖర్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



• పుప్పొడి నేత

పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే!
వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే!
అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి.
అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది. 'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లిపాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్కజొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్


శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్లభామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ


మన్నిదా బాను

స్త్రీ శక్తి

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద యాక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సెన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్లగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.


రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై-రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో-పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ


బాల త్రిపుర సుందరి





అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికెట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.



పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.

– వీఎమ్‌ఆర్
ఫొటోలు: ఎస్‌ఎస్ ఠాకూర్



సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో
ఆటోనో స్కూటరో కారో
బుక్ చేయొచ్చు. వస్తుంది.
కాని ఒంటెను బుక్ చేయొచ్చా?
దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు
ఎడారిలో తప్పిపోయారు.
ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు.
ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు.
ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న
ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని చాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.